సాక్షి
నల్లగొండ

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



ఎఫ్‌పీఓలు బలోపేతం కావాలి
ఎఫ్‌పీఓలు బలోపేతం కావాలని మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్ నారాయణ అన్నారు. - 8లో



చెర్వుగట్టు ముస్తాబు
చెర్వుగట్టు శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. - 8లో



భువనగిరిలోనూ ఆస్తులు
హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ ఆస్తులు యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ బయటపడ్డాయి. - 8లో

న్యూస్‌రీల్

నల్లగొండ డీఎస్పీ బదిలీ

నల్లగొండ క్రైం : నల్లగొండ డీఎస్పీ ఎం.శ్రీధర్ రెడ్డి సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యాదగిరిగుట్ట ఏసీపీగా పనిచేస్తున్న కొలను శివరాంరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి డీజీపీ రవిగుప్తా ఉత్తర్వులు జారీచేశారు. శివరాంరెడ్డి కొంతకాలం చిట్యాల సీఐగా పనిచేశారు.

ఎక్సైజ్ సీఐలు..

నల్లగొండ క్రైం : జిల్లాలోని ఎక్సైజ్ శాఖలో పలువురు సీఐలను బదిలీలు చేస్తూ ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నకిరేకల్‌లో సీఐ శేఖర్‌ను షాద్‌నగర్‌కు, దేవరకొండ సీఐ వెంకటేశ్వర్లును సీపీ రావులపల్లికి, నల్లగొండ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డిని మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, నల్లగొండ ఐఎంఎల్ డిపోలో విధులు నిర్వహిస్తున్న మల్లయ్యను సూర్యాపేట సీఐగా బదిలీ చేశారు. దూల్‌పేట సీఐ ప్రసాద్‌ను నల్లగొండకు, ఘట్‌కేసర్ సీఐ మల్లయ్యను నకిరేకల్‌కు, మెదక్ సీఐ మోహన్‌కుమార్‌ను దేవరకొండకు, సీపీ కాపాలపల్లి సీఐ సైదులును డీటీఎఫ్ నల్లగొండకు, బాలానగర్ సీఐ సైదాబాయిని నల్లగొండ ఐఎంఎల్ డిపోకు బదిలీ చేశారు.

డీపీఓ, డీఆర్‌డీఓ బదిలీ


కాళిందిని


విష్ణువర్ధన్‌రెడ్డి

నల్లగొండ : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకేచోట మూడు సంవత్సరాల నుంచి పనిచేస్తున్న వారితోపాటు సొంత జిల్లాలో ఉన్న వారిని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు బదిలీ చేశారు. ఈ మేరకు నల్లగొండ డీఆర్‌డీఓ కాళిందిని ఆదిలాబాద్ జెడ్పీ డిప్యూటీ సీఈఓగా బదిలీ చేయగా, ఆమె స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీఆర్‌డీఓగా పనిచేస్తున్న టి.నాగిరెడ్డిని నల్లగొండ డీఆర్‌డీఓగా బదిలీ చేశారు. నల్లగొండలో డీపీఓగా పనిచేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓగా బదిలీ చేయగా.. నారాయణపేట జిల్లా డీపీఓగా పనిచేస్తున్న కాశం మురళిని నల్లగొండ డీపీఓగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సామాజిక అంశాలపై చైతన్యం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మద్దిలేటి

నల్లగొండ రూరల్ : ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సామాజిక అంశాలపై ప్రజలను చైతన్యం చేయాలని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్దిలేటి సూచించారు. సోమవారం మహాత్మా గాంధీ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు యూనివర్సిటీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు ప్రేమ్‌సాగర్, సుధాకర్, శ్రీను, వీరస్వామి, రూప, మహంతి, ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ డిజైనింగ్‌పై అవగాహన ఉండాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

నల్లగొండ రూరల్ : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా డిజిటల్ డిజైనింగ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని స్పేస్ సీఈఓ శశిప్రీతమ్, ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యామ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో డిజిటల్ డిజైనింగ్‌కు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డిజిటల్ సినిమాటోగ్రఫీ, డబ్బింగ్, వాయిస్ ఓవర్ స్కిల్స్, ఆడియో ప్రొడక్షన్, ఎడిటింగ్, ప్లేబ్యాక్ లైవ్, డిజిటల్ డిజైనింగ్, సోషల్ మీడియా మేనేజిమెంట్, లైవ్ సౌండ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు డిజిటల్ డిజైనింగ్‌పై నెల రోజుల పాటు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌నాయక్, హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి నర్సింహరాజు, రాజారామ్, యాదగిరి పాల్గొన్నారు.

నేడే రైతు గర్జన

నల్లగొండలో బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభ

- కేఆర్‌ఎంబీకి కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతకు నిరసనగా పోరు
- హాజరుకానున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్
- 2 లక్షల మందిని తరలించేలా ఏర్పాట్లు


బీఆర్‌ఎస్ సభకు సిద్ధమైన వేదిక

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కృష్ణా ప్రాజెక్టుల నిర్వహణను కృష్ణానది యాజమాన్య బోర్డుకు(కేఆర్‌ఎంబీ) అప్పగింత అంశంపై బీఆర్‌ఎస్ పార్టీ పోరుకు సిద్ధమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ రైతు గర్జన పేరుతో నల్లగొండలో బహిరంగ సభ నిర్వహిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు నల్లగొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ రోడ్డులో 50 ఎకరాల స్థలంలో బహిరంగ సభ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు, ఇతర ముఖ్యనేతలు పాల్గొనే ఈ సభ ఏర్పాట్లను వారం రోజుల నుంచి మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి నేతృత్వంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య పర్యవేక్షిస్తున్నారు.

ఐదు ఉమ్మడి జిల్లాల నుంచి జన సమీకరణ

ప్రతిపక్ష నాయకుడి హోదాలో కేసీఆర్ మొదటిసారిగా నల్లగొండ బహిరంగ సభకు హాజరవుతున్నారు. నీళ్లే ప్రధాన అంశంగా కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోని కృష్ణానదిపై ఉన్న సాగునీటి ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వమే కేంద్రానికి అప్పగించిందని బీఆర్‌ఎస్ ఆరోపిస్తూ ఈ నిరసన సభకు పిలుపునిచ్చింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల కృష్ణా పరీవాహక జిల్లాలైన ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మంలో సాగునీటితో పాటు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో తాగునీటి కష్టాలు పొంచి ఉన్నాయని చెబుతోంది. ఈ సభకు ఆయా జిల్లాల నుంచి దాదాపు రెండు లక్షల మందిని తరలించేలా ఏర్పాట్లు చేసింది. సభకు వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా నియోజకవర్గానికి ఒకరు చొప్పున పార్టీ సీనియర్లను ఇన్‌చార్జిలుగా నియమించింది. సభ ముగిసిన తరువాత వచ్చిన వారంతా తిరిగి క్షేమంగా ఇంటికి చేర్చేలా ఆయా ఇన్‌చార్జిలకు బాధ్యతలను అప్పగించింది.

భారీగా సభా వేదిక

సభా వేదికను భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. సాధారణంగా ఎన్నికల సమయంలో 50 నుంచి 80 అడుగుల సభా వేదికను ఏర్పాటు చేయగా, ఈ సభకు మాత్రం అంతకంటే పెద్దదైన సభావేదికను ఏర్పాటు చేశారు. 200 నుంచి 250 మంది వేదికపై కూర్చునేలా 135 అడుగుల వేదికను సిద్ధం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, ఇతర మాజీ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మర్లు, మాజీ చైర్మన్లు సభా వేదికపై కూర్చునేలా ఏర్పాట్లు చేశారు.

హెలికాప్టర్‌లో రానున్న కేసీఆర్

మాజీ సీఎం కేసీఆర్ ఈ సభకు హెలికాప్టర్‌లో రానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ ప్రారంభం కానుంది. కేసీఆర్ మాత్రం 4 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకుంటారు. అంతకంటే ముందుగానే మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు బస్సులో సభా వేదిక వద్దకు చేరుకుని మాట్లాడనున్నారు. 4 గంటలకు కేసీఆర్ వచ్చాక ఆయన ప్రసంగం ప్రారంభం కానుంది. 5 గంటలకు కేసీఆర్ ప్రసంగం పూర్తయిన తరువాత హెలికాప్టర్‌లో తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

పార్కింగ్ ప్రదేశాలు ఇవీ..

- తుంగతుర్తి, సూర్యాపేట, నకిరేకల్, మిర్యాలగూడ, కోదాడ, హుజూర్‌నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలకు సాక్షి ఆఫీస్ ఎదురుగా పార్కింగ్ స్థలం కేటాయించారు.
- ఆలేరు, భువనగిరి, హైదరాబాద్, నార్కట్‌పల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎంఎన్‌ఆర్ గార్డెన్స్ వెనుక భాగంలో, చంద్రగిరి విల్లాస్ మీదుగా వెళ్లే ఖాళీ స్థలంలో, మారుతీ షోరూమ్ వెనుక మూడుచోట్ల ఏర్పాటు చేశారు.
- దేవరకొండ, మునుగోడు వైపు నుంచి వచ్చే వారికి లక్ష్మీగార్డెన్స్ సమీపంలోని ఎల్లమ్మగుడి ఎదురుగా వీధిలో ఉన్న స్థలంలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

సభకు భారీగా తరలిరావాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

నల్లగొండ టూటౌన్ : కృష్ణాజలాల పరిరక్షణ కోసం నల్లగొండలో బీఆర్‌ఎస్ నిర్వహించే సభకు భారీగా తరలిరావాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణం మర్రిగూడ బైపాస్‌లో బీఆర్‌ఎస్ బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం ఆయన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, జీవన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ పోరాటంతోనే అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానం చేసిందన్నారు. కృష్ణా జలాలపై పోరాడాల్సిన కాంగ్రెస్ నాయకులు తమపై ఎదురుదాడి చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి కేంద్రంతో లోపాయికారి ఒప్పందం ఉందని, వాళ్ల చేతగానితనం వల్లే కృష్ణా జలాలపై హక్కుని కోల్పోయామన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ చిల్లర మాటలు మాట్లాడుతున్నారని.. కృష్ణా జలాల వివాదం వస్తే మేడిగడ్డ పోయి ఏం చేస్తారని ప్రశ్నించారు. సీఎం, మంత్రులు నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌ను ఎందుకు సందర్శించడం లేదని ప్రశ్నించారు. ప్రజలంతా నీటి కోసం మరోసారి పోరాటం చేయాల్సి అవసరం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సభ సమన్వయకర్త రవీందర్‌సింగ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి


ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరిచందన, పక్కన అదనపు కలెక్టర్లు

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ హరిచందన ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తుదారులకు ఇబ్బంది కలగకుండా ఎప్పటి దరఖాస్తులు అప్పుడే పరిష్కరించాలని చెప్పారు. ఒకసారి వచ్చిన దరఖాస్తులు మళ్లీ రాకుండా చూసుకోవాలని, ఈ విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంతోపాటు, అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ హరిచందన అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె సంక్షేమ శాఖల అధికారులతో వసతి గృహాల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ప్రీ మెట్రిక్ గిరిజన హాస్టల్ వార్డెన్ ఎం.అహల్య స్థానికంగా ఉండకపోవడం, విద్యార్థినులకు భోజనం సరిగా పెట్టడంలో నిర్లక్ష్యం వహించినందుకు ఆమెను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తా

- ఎస్పీ చందనాదీప్తి


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం : సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని ఎస్పీ చందనాదీప్తి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఆర్ పోలీసు సిబ్బందితో నిర్వహించిన దర్బార్‌లో ఆమె మాట్లాడారు. బందోబస్తు, ఎస్కార్ట్ విధి నిర్వహణలో సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో అంకితభావంతో విధులు నిర్వహించాలని, ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటే పోలీసు శాఖకు గౌరవం, ప్రజల నుంచి మన్నన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ హనుమంతరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాస్, ఆర్‌ఐలు హరిబాబు, సంతోష్, సూరప్పనాయుడు, ఆర్‌ఎస్‌ఐలు కళ్యాణ్‌రాజు, నాగరాజు, మమత తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను స్వీకరించి సమగ్ర దర్యాప్తు జరిపి సత్వర న్యాయం అందించాలని ఎస్పీ చందనా దీప్తి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్‌డేలో భాగంగా ఆమె పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. భూ సంబంధ సమస్యలు, శాంతిభద్రతలకు భంగం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

బీఆర్‌ఎస్ సభను అడ్డుకుంటాం


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ : నల్లగొండలో మంగళవారం నిర్వహించే బీఆర్‌ఎస్ సభను అడ్డుకుంటామని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం మిర్యాలగూడలోని రాజీవ్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ జిల్లాలోని ఎస్‌ఎల్‌బీసీ, డిండి ఎత్తిపోతల పథకం, పనులను కుర్చీ వేసుకుని పూర్తి చేస్తామని చెప్పి కనీసం నల్లగొండ జిల్లా ముఖం కూడా చూడలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేసీఆర్ సభను అడ్డుకోవడంతోపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్రనాయకుడు స్కైలాబ్‌నాయక్, పీసీసీ సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య, నాయకులు పొదిల శ్రీనివాస్, అర్జున్, తలకొప్పుల సైదులు, నరసింహారావు, పొలగాని వెంకటేష్‌గౌడ్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

కేసీఆర్ రాకను నిరసిస్తూ మినీ సభ నిర్వహిస్తాం


మాట్లాడుతున్న నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన గుమ్మల మోహన్‌రెడ్డి, రమేష్‌గౌడ్, లక్ష్మయ్య తదితరులు

నల్లగొండ : జిల్లాలోని ప్రాజెక్టులను కుర్చీ వేసుకుని పూర్తిచేస్తానని చెప్పి మాట తప్పిన కేసీఆర్.. ఇప్పుడు కృష్ణా జలాలపై సభ నిర్వహించడాన్ని నిరసిస్తూ.. నల్లగొండలోని గడియారం సెంటర్‌లో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మినీ సభ నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.600 కోట్లతో ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని ప్రారంభించారని.. అప్పుడే 90 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో సొరంగ మార్గాన్ని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని జిల్లాకు వస్తున్నారని ప్రశ్నించారు. మంగళవారం గడియారం సెంటర్‌లో ఆనాడు కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను స్క్రీన్ ద్వారా ప్రజలకు చూపిస్తామన్నారు. సమావేశంలో నాయకులు జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, కేసాని వేణుగోపాల్, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఇంతియాజ్, షేక్ జహంగీర్, జూలకంటి సైదిరెడ్డి, రామకృష్ణ, షబ్బీర్‌బాబా, విజయ్ పాల్గొన్నారు.

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి


బహుమతులు పొందిన విద్యార్థులతో డీఈఓ భిక్షపతి తదితరులు

నల్లగొండ : పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఈఓ భిక్షపతి ఆకాంక్షించారు. నేషనల్ సైన్స్‌డే సందర్భంగా సోమవారం నల్లగొండలోని డైట్ కళాశాలలో జిల్లా స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో మొదటిస్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈ నెల 28న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, రిసోర్స్ పర్సన్ ఆకునూరి జానయ్య, కె.లింగారెడ్డి, నర్సింహ, సాగర్ల సత్తయ్య, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

- పెయింటింగ్ విభాగంలో మొదటి స్థానం నోముల హర్షవర్ధన్, 9వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ నోముల), రెండవ స్థానం బి.లక్ష్మి, 8వ తరగతి (కేజీబీవీ వేములపల్లి), మూడవ స్థానం ఫిరోజ్ కౌసర్, 10వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ నార్కట్‌పల్లి).
- కవిత్వం విభాగంలో మొదటి స్థానం ఝాన్సీ, 8వ తరగతి (కేజీబీవీ వేములపల్లి) రెండవ స్థానం నాగశివ, 9వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ కొప్పోలు), మూడో స్థానం అర్జున్‌దాస్, 10వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ నిడమనూరు).
- పాటల విభాగంలో మొదటి స్థానం ఆర్.నవ్యశ్రీ, 10వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ కొండమల్లేపల్లి), రెండవ స్థానంలో జి.శివాని, 10వ తరగతి (ప్రభుత్వ పాఠశాల పానగల్), మూడవ స్థానంలో ఎం.అశ్విత, 9వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ నాంపల్లి).
- ఉపన్యాస పోటీల్లో మొదటి స్థానం వి.ప్రణవిక, 10వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ తిప్పర్తి)రెండో స్థానంలో బి.స్పందన, 9వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ తిప్పర్తి), మూడవ స్థానం సీహెచ్.స్వాతి, 9వ తరగతి (జెడ్పీహెచ్‌ఎస్ పలివెల).

పెద్ద మండలం.. పనిభారం!

- జిల్లాలోనే అతి పెద్ద మండలంగా మిర్యాలగూడ
- 46 గ్రామ పంచాయతీలు, 48 మున్సిపల్ వార్డులు
- అరకొర సిబ్బందితో తీరని రెవెన్యూ సమస్యలు
- అర్బన్, రూరల్ మండలాలుగా విభజించాలంటూ పలువురి డిమాండ్


మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయం

మిర్యాలగూడ టౌన్ : నల్లగొండ జిల్లాలోనే అతి పెద్ద మండలంగా మిర్యాలగూడ అవతరించింది. మండలం పరిధిలో 46 గ్రామ పంచాయతీలు, 49 వరకు అవాస గ్రామాలు, 48 మున్సిపల్ వార్డులు ఉన్నాయి. మిర్యాలగూడ పట్టణ జనాభా 1.33 లక్షల పైచిలుకు ఉండగా, గ్రామ పంచాయతీల జనాభా సుమారు 75 వేలు ఉంది. ఇంత పెద్ద మండలానికి ఒక్కరే తహసీల్దార్, అరకొర సిబ్బంది ఉండడంతో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం, సర్టిఫికెట్ల కోసం కార్యాలయానికి వచ్చే వారు రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. ఈ మండలాన్ని రెవెన్యూ, అర్బన్‌గా విభజిస్తే అదనపు సిబ్బంది రావడం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.

అరకొర సిబ్బందితో ఇబ్బందులు..

తహసీల్దార్ కార్యాలయానికి నిత్యం వందలాది మంది వస్తుంటారు. భూ సమస్యలు, రిజిస్ట్రేషన్లు, వివిధ ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ కార్యాలయం నుంచి పొందాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో ఒక తహసీల్దార్, ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు ఉన్నారు. వీరిలో ఒకరు ఎలక్షన్, మరొకరు ధరణి చూస్తున్నారు. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు ఉండగా.. ఒకరు ఎలక్షన్‌కు కేటాయించారు. ఇద్దరు ఆర్‌ఐలు, టైపిస్ట్‌తో పాటు జూనియర్ అసిస్టెంట్లను కూడా ఎలక్షన్లకు కేటాయించారు. ఓ జూనియర్ అసిస్టెంటు, ఓ రికార్డు అసిస్టెంట్, అటెండర్ డిప్యూటేషన్‌పై ఆర్డీఓ కార్యాలయంలో పని చేస్తున్నారు. సిబ్బంది అరకొరగా ఉండడంతో ప్రస్తుతం ఉన్న వారిపైనే భారం పడుతోంది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే వారికి వెంటనే ఆ పని అయ్యే పరిస్థితి ఉండడం లేదు.

విభజిస్తే ప్రజలకు మేలు..

46 గ్రామ పంచాయతీలు, 48 మున్సిపల్ వార్డులతో ఉన్న మిర్యాలగూడ మండలాన్ని అర్బన్, రూరల్‌గా విభజిస్తే ప్రజలకు మేలు కలగనుంది. రెండు రెవెన్యూ కార్యాలయాలు ఏర్పాటు చేసి సిబ్బందిని కేటాయిస్తే పట్టణ, గ్రామీ ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. సిబ్బందిపై కూడా పనిభారం తప్పుతుంది. జనాభా పెరుగుతున్న దృష్ట్యా ప్రభుత్వ పెద్దలు ఆలోచించి వెంటనే మిర్యాలగూడను అర్బన్, రూరల్ మండలాలుగా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అదనపు సిబ్బంది అవసరం



“ మిర్యాలగూడ అతి పెద్ద మండలంగా ఉంది. ప్రస్తుతం ఉన్న సిబ్బంది కంటే అదనపు సిబ్బంది చాలా అవసరం, వీఆర్‌ఓ వ్యవస్థ లేకపోవడంతో మరింత భారం పెరిగింది. అయినా పట్టణ, మండల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. అదనపు సిబ్బంది ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించవచ్చు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– హరిబాబు, తహసీల్దార్, మిర్యాలగూడ

మండలాన్ని విభజించాలి



“ మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయంలో ప్రస్తుతం ఉన్న సిబ్బంది సరిపోవడం లేదు. ఏదైనా పని కోసం కార్యాలయానికి వెళ్తే రోజుల తరబడి తిరగాల్సి వస్తోంది. మండలాన్ని అర్బన్, రూరల్‌గా విభజిస్తే సిబ్బంది పెరిగి సమస్యలు వెంటనే పరిష్కారమయ్యే అవకాశం ఉంటుంది. విషయంపై ప్రభుత్వాలు ఆలోచన చేయాలి.

– నవీన్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి, మిర్యాలగూడ

క్లుప్తంగా

ఇద్దరు జేబు దొంగల అరెస్ట్

కొండమల్లేపల్లి : జేబు దొంగతనాలకు పాల్ప డుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వినుకొండ మండలం రైలుపేటకు చెందిన పులి దుర్గా రావు, ప్రకాశం జిల్లా దర్శి మండలం దొనకొండకు చెందిన మూట వెంకటేశ్వర్లు స్నేహితులు. వీరిద్దరూ కొంతకాలంగా తెలుగు రాష్ట్రాల్లోని రద్దీ ప్రదేశాల్లో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా వీరు ఈ నెల 2న కొండమల్లేపల్లి బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ స్థానికుడైన రమావత్ చందు పర్సును చాకచక్యంగా అపహరించారు. కొద్ది సేపటి తర్వాత బాధితుడు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాల్లో నిందితులను గుర్తించి నిఘా ఉంచారు. సోమవారం ఇద్దరు నిందితులు కొండమల్లేపల్లి బస్టాండ్‌కు రాగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి వివరించారు.

లాకర్‌లోని నగదు చోరీ

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని వలిగొండ రోడ్డులో ఆదివారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. ఫ్లిప్‌కార్ట్‌వారి ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యాలయం వలిగొండ రోడ్డులో ఉంది. వినియోగదారులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వివిధ రకాల సామగ్రిని సంబంధిత వ్యక్తులకు చేరవేస్తుంటారు. ఆ రకంగా వినియోగదారుల నుంచి వచ్చే నగదును క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్ (సీఎంఎస్) తీసుకెళ్తారు. అయితే సెలవు కావడంతో ఆదివారం రోజున నగదు తీసుకెళ్లలేదు. దాంతో ఆ నగదును సంస్థ టీం లీడర్ మాధవరావు కార్యాలయంలోని లాకర్‌లో భద్రపరచి రాత్రి పదిగంటల ప్రాంతంలో షట్టర్ వేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం కార్యాలయం తెరిచేందుకు వెళ్లగా షట్టర్‌కు వేసిన తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించాడు. వెంటనే లోనికి వెళ్లి లాకర్‌లో చూడగా అందులో భద్రపరచిన రూ.1.55లక్షల నగదు కన్పించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

గంజాయి విక్రేత అరెస్ట్

మాడుగులపల్లి : గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ రూరల్ సీఐ కట్టెకోల వీరబాబు తెలిపారు. మాడుగులపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరేష్ కుమార్‌తో కలిసి సోమవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మాడుగులపల్లి చౌరస్తాలోని రాజూస్ ఫేమస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం రాత్రి స్థానిక పోలీసులు దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 25 గ్రాముల ఎండు గంజాయి, 676 గ్రాముల చార్మినార్ గోల్డ్ మునక్కా పేరుతో ఉన్న మూడు గంజాయి చాక్లెట్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి ఒడిశా రాష్ట్రంలోని కేంద్రపార జిల్లా మహంగ గ్రామానికి చెందిన షేక్ మౌజమ్ అలీగా గుర్తించారు. ఇతను ఒడిశాలో తక్కువ ధరకు గంజాయి తెచ్చి ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు రెండు నెలలుగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నట్లు తెలిసింది. నిందితుడిపై నార్కొటిక్స్ డ్రగ్స్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ (ఎన్‌డీపీఎస్ చట్టం) ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

భువనగిరిలోనూ శివబాలకృష్ణ ఆస్తులు

గుర్తించిన ఏసీబీ అధికారులు

- శివబాలకృష్ణ కుటుంబ సభ్యుల పేరున 52 ఎకరాల భూములు
- డాక్యుమెంట్లు ఫ్రీజ్ చేయాలని కలెక్టర్‌కు వినతి
- హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్‌పై ఇక్కడ కూడా విచారణ

సాక్షి, యాదాద్రి: హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణ ఆస్తులు యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ బయటపడ్డాయి. ఆయనపై జరుగుతున్న విచారణ సందర్భంగా.. భువనగిరి జిల్లాలో భూములు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. విలువైన వ్యవసాయ భూములను తన కుటుంబ సభ్యుల పేరున రిజిస్టర్ చేసుకున్నట్లు తేలింది. వలిగొండ, బీబీనగర్, మోత్కూరు మండలాల్లో శివ బాలకృష్ణ కుటుంబ సభ్యుల పేరున గల 52.31 ఎకరాల వ్యవసాయ భూముల వివరాలను ఏసీబీ అధికారులు సేకరించారు. ఇందుకు సంబంధించిన కొన్ని వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి వాటిని ఫ్రీజ్ చేయాలని కోరినట్లు సమాచారం.

ఏసీబీ అధికారులు గుర్తించిన ఆస్తుల వివరాలు ఇవీ..

శివబాలకృష్ణ కుటుంబ సభ్యుల పేరుతో భువనగిరి జిల్లాలో ఏసీబీ అధికారులు గుర్తించిన భూముల వివరాలు ఇలావున్నాయి.. వలిగొండ మండలం నర్సాపూర్‌లో ఎస్.హరిప్రసాద్ పేరున 8 ఎకరాలు, ఎస్.రఘుదేవి పేరున 11.03 ఎకరాలు, వలిగొండ మండల చిత్తాపురంలో ఎస్.పద్మావతి పేరున ఎకరం 30 గుంటలు, బీబీనగర్ మండలం చిన్నరావులపల్లిలో శివఅరుణ పేరున 20 గుంటలు, మోత్కూరు మండలం పాలడుగులో శివనవీన్ పేరున 6.32 ఎకరాలు, 12.5 ఎకరాలు, వలిగొండ మండలం రెడ్లరేపాకలో శివనవీన్ పేరున 4.22 ఎకరాలు, 5.32 ఎకరాల వ్యవసాయ భూమిని వారి కుటుంబ సభ్యులపేరున ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.

రిజిస్టర్ డాక్యుమెంట్ల కావాలి

శివబాలకృష్ణ కుటుంబ సభ్యులైన శివనవీన్, శివ అరుణ, ఎస్.ప్రసాద్, ఎస్.పద్మావతి, ఎస్.రఘుదేవి పేరున వ్యవసాయ భూముల డాక్యుమెంట్ల ఫ్రీజ్ చేయాలని కలెక్టర్‌ను ఏసీబీ అధికారులు కోరారు. ఇందుకు సంబంధించిన రిజిస్టర్ డాక్యుమెంట్లు, స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, రిజిస్ట్రేషన్ కోసం సమర్పించిన గుర్తింపు కార్డులు, మ్యుటేషన్ ఫైల్స్ ఇవ్వాలని కోరారు. అలాగే, శివబాలకృష్ణ కుటుంబ సభ్యులకు సంబంధించిన డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని, తాము ఇచ్చిన వివరాల ప్రకారం ధరణీ పోర్టల్‌లోఉన్న రికార్డులను, కార్యాలయంలో ఉన్న రికార్డుల హార్డ్ కాపీలను పరిశీలించాలని కోరారు. శివబాలకృష్ణ పేరు మీద జిల్లాలో ఇంకేమైన ఆస్తుల డాక్యుమెంట్‌లు ఉంటే వాటికి సంబంధించి చెల్లించిన ఫీజు వివరాలను తమకు ఇవ్వడంతోపాటు వాటిని కూడా ఫ్రీజ్ చేయాలని ఏసీబీ అధికారులు కోరారు.

22 మంది ఆధార్‌కార్డులు

శివబాలకృష్ణకు కుటుంబ సభ్యులు, ఆయన భార్య, కుమార్తె, కుమారుడు, తల్లిదండ్రులు, స్నేహితులు, బావమరిది, సొదరుని కుమారులు, కోడలు, వారి స్నేహితులకు సంబంధించి మొత్తం 22మంది ఆధార్ కార్డులు కలెక్టర్‌కు ఏసీబీ అధికారులు పంపించారు. జిల్లాలో ఎక్కడైనా వీరికి సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఆస్తిపాస్తుల వివరాలు తమకు ఇవ్వడంతో పాటు వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని కోరారు.

ఎఫ్‌పీఓలు బలోపేతం కావాలి

- లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ



మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ

కట్టంగూర్ : రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు) సంఘటితమై మార్కెటింగ్ రంగంలో బలోపేతం కావాలని మాజీ ఐఏఎస్ అధికారి, లోక్‌సత్తా వ్యవస్థాప అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. కట్టంగూరు మండలం గంగదేవిగూడెం సమీపంలో ఉన్న 'కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్'లో సోమవారం జరిగిన ఉమ్మడి జిల్లాలోని ఎఫ్‌పీఓ చైర్మన్, సీఈఓ, డైరెక్టర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని, నిమ్మ ఒరుగుల తయారీ విధానం, కస్టమ్ హైరింగ్ సెంటర్, సోలార్ కోల్డ్ రూమ్స్, పలు రకాల వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగుల మందు కొనుగోలు విధానాన్ని, నిమ్మకాయలు, కూరగాయల మార్కెటింగ్ విధానం పరిశీలించి మట్లాడారు. రైతులు మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే డిమాండ్‌కు తగ్గట్టు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలు సాగుచేయాలన్నారు. ఎఫ్‌పీఓలు రైతులకు వ్యాపార దృక్పథం నేర్పాలన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, నకిరేకల్ హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్, ఎఫ్‌పీఓ చైర్మన్ సైదమ్మ పాల్గొన్నారు.

కానరాని పులి సంచారం ఆనవాళ్లు

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల పరిధిలోని మాదవ ఎడవల్లి, పోతనేనిపల్లి గ్రామాల శివారులో పులి సంచారం ఆనవాళ్లు కనిపించలేదని అటవీ అధికారులు తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల పరిధిలో నల్లగొండ, మిర్యాలగూడ, చిట్యాల, నకిరేకల్ ఎఫ్‌ఆర్‌ఓలు బాచిరెడ్డి, ఆనంద్, మల్లారెడ్డి, అశోక్‌రెడ్డి పర్యటించారు. క్షుణ్ణంగా పరిశీలించినా పులి అడుగుజాడలు లభించలేదని తెలిపారు. వీరితో పాటు నార్కట్‌పల్లి ఎఫ్‌బీఓ భవాని ఉన్నారు.

కారు డిక్కీలో మహిళ మృతదేహం

- మృతురాలు నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని కేశరాజుపల్లి వాసి
- మతిస్థిమితం కోల్పోయి భిక్షాటన చేస్తూ జీవనం
- తెరిచి ఉన్న కారు డిక్కీలో పడుకుని అనారోగ్యంతో మృతిచెందినట్లు భావిస్తున్న పోలీసులు

చిట్యాల: కారు డిక్కీలో మహిళ మృతదేహం కనిపించడంతో సోమవారం చిట్యాలలో కలకలం రేగింది. చిట్యాల పట్టణంలోని వెంకటేశ్వర హిల్ కాలనీకి చెందిన తెల్పునూరి రాజు డిక్కీకి తాళం వేయకుండా తన కారును ఆదివారం రాత్రి బస్టాండ్ వద్ద పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం రాజు కారును తీసుకువెళ్లేందుకు రాగా డిక్కీ డోరు కొద్దిగా తెరిచి ఉండటంతో అనుమానంతో దానిని పూర్తిగా తెరిచి చూశాడు. అందులో మహిళ మృతదేహం కనిపించడంతో హతాశుడయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని ఎస్ఐ నవీన్‌కుమార్ పరిశీలించారు. ఆ మహిళ ఎవరని ఆరా తీయగా నల్లగొండ మున్సిపాలిటీ పరిధి కేశరాజుపల్లి గ్రామానికి చెందిన ఆవుల ముత్తమ్మ(41)గా తేలింది. మృతురాలి కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత వివరాలు సేకరించారు. కొంతకాలంగా ముత్తమ్మ మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుంది. మూడు రోజుల క్రితం నార్కట్‌పల్లికి చేరుకుని అక్కడి నుంచి చిట్యాలకు వచ్చి భిక్షాటన చేస్తూ గడిపింది. ఇదే క్రమంలో చిట్యాల పట్టణంలోని బస్టాండ్ వద్ద తెరుచుకుని ఉన్న కారు డిక్కీలో పడుకుంది. అనారోగ్య సమస్యలతో మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతురాలి చెల్లెలు కుమారుడు మర్రి బండి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

హాస్టల్ నుంచి విద్యార్థి పరార్

- రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో గుర్తించిన పోలీసులు
- తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత




మణిచరణ్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

భూదాన్‌పోచంపల్లి : అర్ధరాత్రి ఎవరికి చెప్పకుండా హాస్టల్ నుంచి పారిపోయిన విద్యార్థి రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో ప్రత్యక్షమయ్యాడు. హాస్టల్ వార్డెన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టిన పోలీసులు 4 గంటల్లోనే కేసును ఛేదించి విద్యార్థిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతం అయ్యింది. చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్ గ్రామానికి చెందిన ఈడ్దుల బుచ్చయ్య, సునిత దంపతుల కుమారుడైన మణిచరణ్(13)ను ఈ సంవత్సరం పోచంపల్లి పరిధిలోని మోడల్‌స్కూల్‌లో 8వ తరగతిలో చేర్పించారు. ఇతను స్థానిక బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన తర్వాత సుమారు ఒంటి గంట సమయంలో మూత్ర విసర్జన కోసమని బయటికి వచ్చి హాస్టల్ ప్రహరీ దూకి పారిపోయాడు. సోమవారం ఉదయం మణిచరణ్ లేడని గమనించిన తోటి విద్యార్థులు వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. ఆమె వెంటనే విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ కుమారుడు మణిచరణ్ ఇంటికి ఏమైనా వచ్చాడా ఆరా తీయగా రాలేదని చెప్పడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పుస్తకాలు దొంగిలించారనే భయంతో..

మణిచరణ్, మరో విద్యార్థి శ్రీనాథ్ ఆదివారం ఉదయం కలిసి హాస్టల్ పక్కనే ఉన్న ఓ ప్రైవేట్‌స్కూల్ ప్రహరీ దూకి తరగతి గదుల్లోని రాక్‌లో విద్యార్థులు భద్రపర్చుకొన్న పుస్తకాలను దొంగిలించేయత్నం చేశారు. అక్కడ ఉన్న స్కూల్ వాచ్‌మన్ గమనించి వీరిని పట్టుకొన్నాడు. హాస్టల్ వార్డెన్‌కు దొంగతనం చేయబోయిన విషయం గురించి ఫోన్‌లో వివరించాడు. దాంతో వార్డెన్ సోమవారం పేరెంట్స్ మీటింగ్ ఉందని రమ్మని చెప్పారు. దొంగతనం విషయం బయటికి తెలుస్తుందనే భయంతోనే విద్యార్థి హాస్టల్ నుంచి పారిపోయాడని భావిస్తున్నారు. హాస్టల్ నుంచి పారిపోయిన మణిచరణ్ రంగారెడ్డి జిల్లా తారామతిపేటకు చేరుకొన్నాడు. సోమవారం ఉదయం ఓ పిచ్చివాడితో కలిసి తిరుగుతుండగా గమనించిన గ్రామస్తులు నీవు చూడటానికి బాగానే ఉన్నావు, ఇలా పిచ్చివాడితో ఎందుకు తిరుగుతున్నావు, ఏ ఊరు అని అడిగారు. మా అమ్మమ్మ హయత్‌నగర్‌లో ఉంటుందని చెప్పడంతో హయత్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా స్టేషన్‌కు తీసుకెళ్లారు. అప్పటికే పోలీసు వాట్సాప్ గ్రూపుల్లో మణిచరణ్ ఫొటో పోచంపల్లికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం ఆ విద్యార్థిని పోచంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

కొలనుపాకను సందర్శించిన మహారాష్ట్ర బృందం



కొలనుపాక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మహారాష్ట్ర బృందం

ఆలేరురూరల్: ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామాన్ని మహారాష్ట్రకు చెందిన పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, సర్పంచుల బృందం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, వైకుంఠధామాన్ని పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికుల పని విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ కొమ్మగాని యాదగిరి, ఎంపీఓ సలీం, కార్యదర్శి రామకృష్ణ, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, బృందం సభ్యులు హరిదని అశోక్, వినయ్ కే తామ్‌కే, అమిత సరళ తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనంపై వృద్ధురాలికి లిఫ్ట్ ఇచ్చి..

- ఒంటిపై ఆభరణాలు దోపిడీ చేసిన యువజంట

చిట్యాల: కుమారుడి ఇంటి వద్ద దిగబెడతామని వృద్ధురాలికి ద్విచక్రవాహనంపై లిఫ్ట్ ఇచ్చిన యువజంట కొద్ది దూరం తీసుకెళ్లి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోపిడీ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన దేశగాని బాలనర్సమ్మ(83) సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సులో చిట్యాల బస్‌స్టేషన్‌కు చేరుకుంది. స్థానికంగా నివాసం ఉంటున్న కుమారుడు బలరాజు వద్దకు వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో బైక్‌పై వచ్చిన యువతి, యువకుడు బాలనర్సమ్మతో మాటలు కలిపారు. కుమారుడు ఇంటి వద్ద దిగబెడుతామని చెప్పి వాహనంపై ఎక్కించుకుని తీసుకువెళ్లారు. పట్టణం నుంచి హైదరాబాద్ రోడ్డులో కొంతదూరం తీసుకువెళ్లి బాలనర్సమ్మ ఒంటిపై ఉన్న రెండు తులాల బంగారు నగలను తీసుకుని పరారయ్యారు. అనంతరం బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్ఐ–2 నవీన్‌కుమార్ తెలిపారు.

ముస్తాబవుతున్న చెర్వుగట్టు దేవాలయం

- రేపటి నుంచి 21వ తేదీ వరకు రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- 17వ తేదీ తెల్లవారుజామున స్వామివారి కల్యాణం
- ఏర్పాట్లు చేస్తున్న దేవాదాయశాఖ



గట్టు కింద నంది విగ్రహానికి రంగులు వేస్తున్న కార్మికులు



లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది



నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామంలో వెలిసిన శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. బుధవారం నుంచి 21వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. చెర్వుగట్టుపై వెలిసిన రామలింగేశ్వరుడు జడల ఆకృతిని పోలి ఉండటంతో జడల రామలింగేశ్వరుడిగా పిలువబడుతున్నట్లు అర్చకులు పేర్కొన్నారు. పరుశరాముడు ప్రతిష్ఠించిన 108 లింగాలలో ఇది చివరిదిగా చరిత్ర చెబుతోంది. అమావాస్య రోజు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా చెర్వుగట్టు దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకొని రాత్రి అక్కడే నిద్రచేస్తుంటారు. ఆలయంలో భక్తులు నిత్య అన్నదానం కార్యక్రమం కొనసాగుతోంది.

ఈ ఏడాది నల్లగొండలో నగరోత్సవం..

బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందు కొనసాగించే నగరోత్సవం కార్యక్రమాన్ని 2019లో రద్దు చేశారు. కానీ ఈ సంవత్సరం నల్లగొండ జిల్లా కేంద్రంలో నగరోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో బుధవారం సాయంత్రం నల్లగొండ పట్టణంలోని రామాలయం వద్ద నగరోత్సవం ప్రారంభించి వీటీ కాలనీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 16వ తేదీ ఉదయం ప్రత్యేక పూజలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, శైవాగమ పండితులు అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని, నీలకంఠశివాచార్య, ఆలయ ప్రధాన అర్చకులు పి. రామలింగేశ్వరశర్మ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

17 తేదీన కల్యాణం

17వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారి కల్యాణం, 18వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు అగ్నిగుండాలు, 19వ తేదీ తెల్లవారుజామున దోపోత్సవంము, సాయంత్రం ఏకాంతసేవ, 20వ తేదీన పుష్పోత్సవం, మహాపూర్ణాహుతి, 21వ తేదీ సాయంత్రం గజవాహనంపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

కల్యాణోత్సవం టికెట్ రూ.1000..

కరోనా తర్వాత ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి టికెట్ ఉండేది కాదు. కానీ ఈసారి కల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులకు రూ.1000 టికెట్ ధర ఆలయ అధికారులు నిర్ణయించారు. 300 మందికి మాత్రమే టికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 15వ తేదీన ఆలయ ఆవరణలో ఈ టికెట్లు విక్రయించనున్నట్లు తెలిపారు. టికెట్ తీసుకుని కల్యాణంలో పాల్గొనే భక్తులకు స్వామివారి ఫొటో, శాలువా, చీర, ప్రసాదం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా 15వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కొండ పైకి వాహనాలు వెళ్లేందుకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఆ ఏడు రోజులు కూడా టోల్ నిర్వాహకులు చార్జీలు వసూలు చేయరాదని టోల్ నిర్వాహకులకు అధికారులు సూచించారు. అదేవిధంగా భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఒక లక్షా యాభై వేల లడ్డూలు తయారు చేయడంతో పాటు ప్రసాదం కోసం పది కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. నల్లగొండ ఆర్డీఓ రవి, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక పరిశీలనలో పనులు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల గురించి ప్రజలకు తెలియజేయడానికి ఉమ్మడి జిల్లాలోనే కాకుండా ఇతర జిల్లాల్లోనూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, వాల్ పోస్టర్లు అంటించడం, కరపత్రాలు పంచడంతో పాటు వాహనాల ద్వారా ప్రచారం చేయిస్తున్నాం. ప్రత్యేక సిబ్బందితో పారిశుద్ధ్యం, నీటి సౌకర్యం కల్పిస్తున్నాం.

– సిరికొండ నవీన్‌కుమార్, ఆలయ ఈఓ

రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవక్షేత్రం

రాష్ట్రంలోనే ప్రసిద్ధ శైవక్షేత్రంగా చెర్వుగట్టు దేవాలయం విరాజిల్లుతోంది. అమావాస్య రోజు దక్షిణ తెలంగాణ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు. అమావాస్య రోజు రాత్రి ఆలయ ఆవరణలో నిద్రించటం వలన అనారోగ్య సమస్యలు తొలగిపోతాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా అగ్నిగుండంలో భక్తులు నడవటం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది.

– పోతులపాటి రామలింగేశ్వరశర్మ, ప్రధాన అర్చకుడు

నెత్తురోడిన రహదారులు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



రేవంత్, మణికుమార్ (ఫైల్)

నల్లగొండ క్రైం: ఉమ్మడి జిల్లాలోని రహదారులు మరోమారు నెత్తురోడాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ, కొండమల్లేపల్లి, మునగాల, భువనగిరి మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ పట్టణానికి చెందిన కంబాలపల్లి రేవంత్ (21), నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన ఎర్ర మణికుమార్(20) స్థానిక నాగార్జున డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలీయర్ చదువుతున్నారు. ఇద్దరు స్నేహితులు పని నిమిత్తం బైక్‌పై ఆదివారం చిట్యాలకు వెళ్లారు. అర్ధరాత్రి దాటిన తర్వాత తిరిగి నల్లగొండకు బయలుదేరారు. నీలగిరి మున్సిపాలిటీ పరిధి మర్రిగూడ బైపాస్ వద్ద పట్టణంలోకి వస్తుండగా మిర్యాలగూడకు వెళ్తున్న లారీ వెనుక నుంచి వేగంగా వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న రేవంత్, మణికుమార్ అక్కడికక్కడే మృతిచెందారు. స్నేహితులిద్దరూ ఎక్కడికి వెళ్లినా కలిసే వెళ్తుంటారని, చివరకు మృత్యువు కూడా వీరి స్నేహబంధాన్ని విడదీయలేకపోయిందని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు రేవంత్ తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

కారు ఢీకొని లారీ క్లీనర్ ..



పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు నుంచి ఉప్పులోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్న లారీని ఆదివారం అర్ధరాత్రి నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఆపారు. ఈ క్రమంలో అదే లారీలో క్లీనర్‌గా వచ్చిన నెల్లూరు జిల్లా కావలి పట్టణం ఇందూరివారిపేటకు చెందిన పుదుచ్చేరి మురళి (49) టీ తాగేందుకు రోడ్డు అవతలి వైపునకు వెళ్లాడు. తిరిగి లారీ వద్దకు నడుచుకుంటూ వస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మురళి అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొని..

మునగాల(కోదాడ): సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల శివారు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం గ్రామానికి చెందిన సంకినేటి మోహనవెంకట సత్యనారాయణరాజు తన భార్య దుర్గా నాగలక్ష్మి (24), కుమారుడితో కలిసి అశోక్‌లీలాండ్ వాహనంలో రంగారెడ్డి జిల్లాలోని వెలిమినేడులో ఉంటున్న అత్తవారింటికి బయలుదేరాడు. మార్గమధ్యలో మునగాల మండలం ఆకుపాముల శివారులోకి రాగానే ముందుగా వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అశోక్ లీలాండ్ వాహనంలో ప్రయాణిస్తున్న దుర్గా నాగలక్ష్మి అక్కడికక్కడే దుర్మరణం చెందగా ఈమె భర్త సత్యనారాయణరాజు, వాహనం డ్రైవర్ ప్రభాకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి తండ్రి శ్రీనివాసరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపారు.

బైక్ పైనుంచి కిందపడి..



నవనీత (ఫైల్)

భువనగిరి క్రైం : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్‌కు చెందిన బూర్గుల రాంరెడ్డి తన తోడల్లుడు సల్ల సుధాకర్‌రెడ్డి కుటుంబాల సభ్యులు ఆదివారం సాయంత్రం యాదాద్రికి వచ్చారు. లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకుని రాత్రి అక్కడే రెడ్డి సత్రంలో నిద్ర చేశారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. రాంరెడ్డి ఇతర కుటుంబ సభ్యులు కారులో, తోడల్లుడు సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి భార్య నవనీత (28) బైక్‌పై ఉప్పల్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో భువనగిరి మండలం రాయగిరి జిల్లా పరిషత్ హైస్కూల్ సమీపంలోని స్పీడ్‌బ్రేకర్ల వద్ద సుధాకర్‌రెడ్డి బైక్ అదుపుతప్పింది. దీంతో బైక్‌పై వెనక కూర్చున్న నవనీత కిందపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని భువనగిరి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి భర్త బూర్గుల రాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.